(17)

# సుడిగాలిలోని దీపం

రచన :
శ్రీమతి ఆర్. వసంత

ఆ రోజు మీటింగులో శ్రీపాల్‌గారు బ్రాంచి ఆఫీసులలో పనులు ఏ విధంగా జరుగుతుందని వివరిస్తూ, ఇంకను ఆఫీసు పురోగమనానికి ఎలాగ కృషి చేయాలో వివరిస్తూ వచ్చారు. వారి ప్రసంగాన్ని, అన్ని బ్రాంచి మేనేజర్లు, డైరక్టర్లు సావధానంగా వింటూ వచ్చారు.

డైరక్టరు శ్రీపాల్ 'రాధాదేవిగారూ ! మీరు యీ బ్రాంచి ఆఫీసు పనుల తీరు, స్టాపును ఎలాగ వుంచుకోవాలో, వారి నుండి సక్రమంగా పనులు ఎలా చేయించుకోవాలో మీకు బాగుగా తెలుసును ? అందువలన యీ ఆఫీసుకు ప్రమోట్ అయి వచ్చిన కొద్ది రోజుల్లోనే, ఎన్నడూ విననంతగా లాభాలు వచ్చాయి. అందరూ వారివారి పనులు చేసుకొంటున్నారు. మిమ్మల్ని అభినందిస్తున్నాను.' అనగానే—

రాధాదేవి 'థాంక్స్.' అన్నది.

'కాని మీరు చేస్తున్న కొన్ని-కొన్ని మంచి పనులలో, కొంత చెడ్డవి వున్నది. అందులో మీస్వార్థంకూడా వుందని భావిస్తున్నాను. ఇక్కడ శ్రీ భుజంగంగారు డైరక్టరుగా వున్నారని మీరు భావించలేదా ? వారితో సంప్రదించకుండా, వారి ఉత్తరవు లేకుండా, ఎట్టి నిర్ణయాలు తీసుకోవడం ఆఫీసు రూల్సుకు విరుద్ధం. అలాగ తీసుకొంటేను, హెడ్డాఫీసుకు మీరు తెలుపవలసిన బాధ్యత మీ మీద వుంది.

భాస్కర్‌ను సస్పెండు చేసినవిషయంలో, మీరే నిర్ణయం చేయడం, మీ నిరంకుశత్వాన్ని తెలియజేస్తుంది. అందుకు మీరేమి జవాబు యిస్తారు ?' అని తన ప్రసంగ ధోరణిలో తెలిపాడు.

రాధాదేవి లేచి, అందరికీ నమస్కరించి 'డియర్ జన్‌టిల్‌మెన్స్ ! నమస్కారములు. మనము పనిచేసే ఆఫీసు ఒక దేవాలయం లాంటిది. నేను యిచ్చటకు వచ్చే సమయంలో ఒక్కొక్కరు, వారి వారి పనులు చేయక వుండడంవలన ఆఫీసు అభివృద్ధిని కోరి, నా అంతట కొన్ని కొన్ని నిర్ణయాలు చేయవలసి వచ్చింది. పైగా భాస్కర్ గారు, తన బంధుత్వమును ఆసరాగా తీసుకొని, తాను ఎప్పుడు పడితే అప్పుడు ఆఫీసుకు రావడం, ఆఫీసు పనులు నిర్వర్తించక పోవడం వలన, ముందు అతన్ని ఒక దారికి తేవాలని చూశాను. శ్రీ భాస్కర్ గురించి, భుజంగంగారికి బాగుగా తెలుసు, కావున తెలిసిన వారికి, ఇంక ఎందుకునే తెలియచెప్ప నవసరం లేదని, ముందుగా అతన్ని ఒక నెల సస్పెండు చేశాను.

అలాగ చేస్తూ, యిక్కడి డైరక్టరుగారికి, హెడ్డాఫీసుకు ఒక కాపి పంపించాను. అలా చేయడం వలన ప్రతి వారు, వారి పనులు వారు చేసుకొంటున్నారు. ఇక్కడివారు కూడా వారి కర్తవ్యం ఏమిటో తెలుసుకొన్నారు. ఇందులోని స్వార్థం గాని ఏ మాత్రం లేదు.' అన్నది.

భుజంగం కోపంతో, 'ఎందుకు లేదు మీ స్వార్థం ! తానే యీ ఆఫీసుకు సర్వాధికారినని, ఎవరితోనూ మీ ప్రమేయం లేకుండా మీరు వ్యవహరించారు. భాస్కర్ పనిచేసే వాడా, కాడా అని మీకు తెలుసా ? మీ యిష్ట ప్రకారం నడచుకొంటూ, మీరు చేసింది న్యాయమని చెప్తూ వుంటే మాలాంటి డైరక్టర్లు ఎందుకు : మీరే అన్నీ చేస్తూ వుండండి !' అని అంటూ వుంటే—

శ్రీపాల్ 'శాంతించండి !' అని అతన్ని శాంతపరచి, 'రాధాదేవిగారూ ! మీరు చేసింది మంచిది అని అనుకుందాం. కాని మీరు మీ డ్యూటీ చేయలేదే ! మీరు యిక్కడి సంగతులు, ఎందుకు భాస్కర్ విషయంలో పైఆఫీసుకు తెలుపలేదు.' అన్నాడు.

రాధాదేవి 'నేను భాస్కర్ ఆర్డరు ఒక కాపీ యిక్కడి డైరక్టరుకు పంపుతూ, అలాగే కాపీ హెడ్డాఫీసుకు పంపించాను' అన్నది.

శ్రీపాల్ ఆ ఫైలును ఆమెకిస్తూ, 'ఇందులో మీరు పంపిన కాపీ వున్నదా చూడండి !' అన్నాడు.

రాధాదేవి ఆర్డరును చూడగా ఆశ్చర్యం వేసింది. టైపు చేసిన కాగితంలో హెడ్డాఫీసుకు ఒక కాపీ పంపుతున్నట్లు టైపు చేయలేదు. ఒరిజినల్ కాపీలో హెడ్డాఫీసుకు వ్రాసి వుంటే దాన్ని ఎవరో కొట్టి వేశారు. అలాగే చూస్తూ చాలా సేపు వుండిపోయింది.

'రాధాదేవిగారూ ! మీరు పంపిన కాపిలో హెడ్డాఫీసుకు పంపినట్లు వుందా ? చెప్పండి. అన్నియు సక్రమంగా చేసే మీరు, ఎందుకు యిలా చేశారు ? మీరు మరచి యిలా చేశారా ? లేక కావాలని చేశారా ? చెప్పండి.' అని అడుగుతూ వుంటే—

జి. ఐ.

IS-325

* ఎలెక్ట్రిక్ మోటారులు
* పంపుసెంట్లు
* మోనోబ్లాకులు



మేము స్క్రీన్ ప్రొటెక్టెడ్ స్లైప్ స్కైల్ కేజ్ ఇండక్షన్ మోటారులను 2, 3, 5, 7, 5 & 10 H.P. లలో 400/440 వోల్టులలో 50 సైకిల్స్ ఎ. సి. సప్లైకు తగినట్టుగా తయారుచేయుచున్నాము.

: వివరములకు :

Phone: Office : 31387 Resi: 33268

Gopalakrishna Industries

163, PATEL ROAD : : COIMBATORE - 641 009.


రాధాదేవి కండ్లు మూసుకొని 'భగవంతుడా! ఎవరికీ తలవంచని నేను, కొందరి దుర్మార్గము వలన తల వంచుకొనే విధంగా చేసుకొనే పరిస్థితి కలిగించాలా?' అని మనసులోనే బాధ పడసాగింది.

ఇంతలో గంట ఒకటి కొట్టడంతో, 'డియర్! లంచ్ తర్వాత 2-30 గం॥లకు మరల మీటింగు ప్రారంభిద్దాం!' అని అనడంతో అందరూ లేచి వెళ్ళారు.

భుజంగం కొర-కొర రాధాదేవిని చూస్తూ వెళ్ళిపోయాడు.

రాధాదేవి తలమీద పిడుగు పడినట్లు భారంగా వుండసాగింది. బాధతో ఆ ఫైలును తీసుకొని, మెల్లగా నడచుకొంటూ తన గదిలోకెళ్ళి కుర్చీలో కూర్చొని, తల ఆనించి తిరుగుతున్న ఫాన్ వైపు చూస్తూ వుండిపోయింది. అలాగ ఎంతసేపు చూస్తూ వున్నదో తనకే తెలియదు.

అసిస్టెంటు మేనేజరు పరమశివం వచ్చి 'అమ్మా! మీటింగు ప్రారంభింప బోతున్నారు.' అన్నాడు.

రాధదేవి బాధతో చూచి 'హుఁ....' అని తన బాధను తేలిక పరచుకోటానికి టేబుల్ మీదున్న నీటిని గబ-గబ త్రాగి ఖాళీ గ్లాసును టేబుల్‌మీద వుంచి—

'పరమశివం గారూ! ఆఫీసులో స్టాఫు అందరూ వచ్చారా?' అన్నది.

'అఁ....' అని జవాబు యిచ్చాడు.

టేబుల్ మీదున్న ఫోన్ తీసుకొని, 'ఆపరేటర్! క్లర్క్ సూర్యారావును యిక్కడకు పంపండి.' అన్నది,

మరో రెండు నిముషాల్లో సూర్యారావు గదిలోనికి వస్తూ, 'నమస్కారమమ్మా!' అన్నాడు.

రాధాదేవి ఫైలును వాని ముందర విసరి 'ఈ ఫైలును చూడండి!' ఇది భాస్కరుకు సస్పెండ్ ఆర్డరు. అందులో పొరబాటు ఏమిటో చూడండి!' అని కోపంతో అన్నది.

సూర్యారావుకు అమెను చూడగానే, తన ప్రాణం తనలో లేకుండా పోయింది. ఫైలును, యంత్రంలాగా తీసుకొని, చూస్తూ వుండిపోయాడు.

రాధాదేవి కండ్లు మంటలు వస్తున్న విధంగా వుంది. 'భాస్కరు అర్డరు కాగితం ఒక కాపి హెడ్డాఫీసుకు వేస్తే మీరు నాకు తెలియకుండా, నాతో సంప్రదించకుండా, దాన్ని కొట్టి పంపకుండా చేశారు. ఎందుకు యిలా చేశారు ! చెప్పండి.' అని బుజం పట్టుకొని అంటూ వుంటే—

సూర్యారావుకు ఏమి చెప్పాలో తెలియకుండా పోయింది. భూమి కంపించేలాగ వుండసాగింది. తాను మాట్లాడే స్థితిలో లేకుంటేనూ, రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ పొంగుతున్న ఆవేదనను బయటకు వెడల గ్రక్కుతూ—

'అమ్మా ! నన్ను క్షమించండమ్మా. బుద్ధి గడ్డి తిని మీకు ద్రోహం చేశాను. భుజంగంగారు, భాస్కర్ సస్పెండ్ కాగితాన్ని హెడ్డాఫీసుకు పంపవద్దని, యీ ఆర్డరును మాపు చేస్తానని, అంటే హెడ్డాఫీసుకు వ్రాసిన గీతను కొట్టి, అక్కడకు పంపకుండా చేశాను. క్షమించండమ్మా !' అని ఏడుస్తూ చెప్పసాగాడు.

రాధాదేవి బాధతో రెండు సెకండ్లు సూర్యారావును చూచింది. ఆ చూపుల్లో తాను భస్మం అయ్యే విధంగా తోచింది అతనికి. అందువలన ఏడుస్తూ తల వంచుకొన్నాడు. అతనితో 'సూర్యారావ్ ! మీరు చిన్న వయసులో వున్నవారు. భవిష్యత్తులో యింకా-యింకా మంచి పదవిలో రావలసిన వారు. అటువంటి మీరు యిలా చేశారంటే బాధగా వుంది !' అన్నది.

రాఘవరావు వచ్చి, 'అమ్మా ! మీటింగు మొదలిడబోతున్నారు. మిమ్మల్ని రమ్మన్నారు !' అన్నాడు.

మరల బాధతో, 'సూర్యారావ్ : యీ ఆఫీసులో ఎవరికి ఏ కష్టం వచ్చినా వారందరు నా స్నేహితులని, నా వాళ్ళని నా కష్టంగా భావించి, సహాయం చేస్తూ వచ్చాను. ఈ ఆఫీసు ఒక దారికి తీసుక రావాలని, వారివారి పనులు జాగ్రత్తగా చేస్తూ వారికీ, నాకూ యీ ఆఫీసుకు మంచి పేరు, కీర్తి సంపాదించాలని ప్రయత్నించాను. కాని .. కాని.... నా ఆశలకు మీరు అడ్డుపుల్ల వేసి, పది మందిలో ఈ రోజు మీటింగులో, ఎన్నడూ ఎవరికీ తల దించుకోలేని నేను మీ వలన యీ గతి కలిగింది !'

మీరందరు నా వాళ్ళని, నా వాళ్ళకు ఏదైనా కష్టం వస్తే అది నా కష్టంలా భావించానే - అటువంటి నాకు ద్రోహం చేసే వాళ్ళుగా యీ ఆఫీసులోని వాళ్ళు వుంటారని తలంచ లేదు. సూర్యారావ్ ! వెళ్ళు....ఇక నీ మొఖం నాకు చూపించకు. వెళ్ళు !' అని కోపంతో, బాధగా అన్నది.

సూర్యారావు మరేమీ మాట మాట్లాడకుండా, బాధతో తల వంచుకొని గదినుండి యివతలకు వచ్చాడు.






రాధాదేవి నిలబడలేక పోయింది. మెల్లగా నడుచుకొంటూ తన కుర్చీలో కూర్చొన్నది. రాఘవరావు, పరమశివం ఆమెనే చూస్తూ రెండు నిముషాలు వుండిపోయారు. ముగ్గురి మధ్యలో ఎటువంటి మాటలు రాకపోవడం వలన, రాధాదేవి బాధతో కుమిలి పోవడం చూడలేక రాఘవరావు, 'అమ్మా! మీరు అనుమతిస్తే, సూర్యారావు చేసిన చెడు పని, దానికి ముఖ్య కారకులయిన భుజంగం నిజ స్వరూపాన్ని అందరు డైరక్టర్సు ముందు తెలియజేస్తాను.' అని ఉద్రేకంతో అంటూ వుంటే—

రాధాదేవి, 'వద్దు బాబుగారూ! ఈ విషయం మన ముగ్గురికోనే వుండనివ్వండి. మంచివాళ్ళకు కాలం లేదని, చెడుకే ముఖ్యస్థానం కలదని, భుజంగం, అతని సహచరుడు సూర్యారావు నిరూపించారు. వారు నాకు కీడు తలిస్తేను: వారికైనా సంతోషంగా వుండనివ్వండి. అయినా ఇంత జరిగాక, మీ మధ్య నేనూ యింకా వుండాలా? చెప్పండి.' అని బాధగా అన్నది.

ఆ మాటలు విన్న పరమశివం 'ఆ మాట అనకండమ్మా! మీ వలననే, యీ సంస్థ రూపురేఖలు దిద్దుకొన్నది. అభివృద్ధి లోనికి రాసాగింది. అటువంటి మీరు మధ్యలో వెళ్ళిపోతే యిక యధాస్థితికి వచ్చి, భుజంగం, భాస్కర్ లాంటి వారి చేతిలో చేరి, యీ ఆఫీసు యింకా-యింకా నష్టంలో నడవవలసి వస్తుంది. ఇంక మేము వయసులో వున్నవారు వేరే ఆఫీసులు చుట్టే గతి, కొంత కాలంలో కలుగుతుంది. దయచేసి మీరు....'

'మీకు తెలియదండి పరమశివంగారూ! నా చిన్నతనంలో తల్లిని పోగొట్టుకొన్నాను. తర్వాత వయసుకు వచ్చే సమయంలో తల్లీ, తండ్రీ అంతా ఒకరుగాను ప్రాణంలో ప్రాణమైన తండ్రిని, అత్తయ్యను పొట్టను పెట్టుకొన్నాను' అని చెప్పలేక బాధతో ఏడ్చింది.

వస్తున్న కన్నీళ్ళు తుడుచుకొని, 'నా కోసం జీవిస్తూ, నన్నే మనసులో నిల్పి ఆరాధించే నా బావ ఇంతవరకు పెండ్లి చేసుకోకుండా వుంటున్నారు, మేనమామయ్య, నా బావ నా మంచిని కోరేవారు అటువంటి మామయ్య ఆరోగ్యం బాగులేదు అని రవిబావ వచ్చివున్నారు. ఈ రోజు రాత్రి కడపటి ట్రైన్ 11-20 కు వుంది. ఇక్కడ అంతా చూచుకొని వెళ్ళాలి.'

నా జీవితంలో ఎన్నడూ వెన్నెల కాచింది లేదు, ప్రతి రోజు సుడిగాలి వీచసాగింది. ఆ గాలిలో యీ దీపం ఆరి పోకుండా వుండాలని భగవంతుని కోరుకొంటూ రవిబావ యీ సుడిగాలిలోని దీపాన్ని తన చేతులతో అడ్డగించి, అనుగ్రహించారు, కావున యిక్కడి సమస్యలకు ఒక తీర్పు కలిగితేనే, నేనూ స్వతంత్రంగా గాలి పీల్చుకోగలను!' అని ఫైల్సు కొన్ని తీసుకొని, చకచక మీటింగుకి హాజరు కావడానికి బయలుదేరింది.

పరమశివం, రాఘవయ్య ఆమె వెనకాల వెంబడించారు. రాఘవయ్య మాత్రం మనసులోనే 'భగవంతుడా.... రాధాదేవికి యీ రోజు ఏది జరిగినా మంచిగానే జరిపించు తండ్రీ!' అని ప్రార్థించాడు.

గదిలో తనకోసం వేసివున్న కుర్చీలో కూర్చొన్నది రాధాదేవి. శ్రీపాల్, మిగతా వాళ్ళు ఏదో ముఖ్యసంగతులు గుర్తించి, ప్రసంగిస్తూ వచ్చారు. రాధాదేవి ఒక కాగితం

తీసి టేబుల్‌మీద వుంచి, ఏదో ముఖ్యమైన లెటరు గబగబ వ్రాయసాగింది.

రెండునిమిషాలు తర్వాత శ్రీపాల్ 'డియర్ ఫ్రెండ్స్! అందరూ వచ్చినట్లుంది.' అని 'రాధాదేవిగారూ! ఉదయం నేను చెప్పినదానికి ఏమి సంజాయిషీ యిచ్చుకొంటారు? లేక, మీరు చేసిన దానికి క్షమించమని అపాలజీ చెబితే, ఇదే మీ మొదటి తప్పుగా భావించి, డైరక్టర్లు మన్నించగలరు!' అని అన్నాడు.

ఆ మాటలు విన్న వెంటనే రాధాదేవి శరీరంలో కరెంటు ప్రాకినట్లు అగుపించింది. ఎవ్వరికీ ఏనాడూ తలవంచని రాధాదేవికి కోపం వస్తున్నా, దిగమ్రింగుకొంటూ లేచి, 'నో! నేను ఎవరికీ ద్రోహం చేయలేదు. తప్పు చేసిన దానిలాగా తల దించుకొని క్షమించమని అడగను. డియర్ జెంటిల్‌మెన్స్! నేను చేసిన నేరం ఏమిటి? నిద్రపోతున్న సంస్థకోసం బంధువు అని చూడకుండా, అందరికీ సమానంగా న్యాయం చేయడం తప్పా! చెప్పండి. అదే ఏదైనా బీదగుమాస్తా చేసి వుంటే, మీరందరూ వెంటనే చర్య తీసుకొనేవారు కదా!

ఈ కంపెనీ పురోభివృద్ధికి, కొందరు సోమరులకు గుణపాఠం చెప్పాలని, నేను వచ్చిన వెంటనే తగుచర్య తీసుకొన్నాను. అందువలన మిగతావారు జాగ్రత్తగా ఎవరి పనులు వారు చేసుకొనేందుకు అవకాశం కలిగింది. ఆ ఆర్డరు కాగితం భాస్కర్‌కు ఇచ్చింది. తప్పని మీరందరూ అనుకొంటే, ఇదిగో నా రాజీనామా కాగితం....ఇంక యీ ఆఫీసులో పని చేయాలని లేదు. దయచేసి నా రాజీనామాను అంగీకరించండి!' అని గబగబ నడచి వచ్చి శ్రీపాల్‌గారికి అందజేసి తన సీటుతో కూర్చొన్నది.

ఆ మాటలు విన్న అందరూ ఒక్కసారిగా ఆశ్చర్యంతో రాధాదేవినే చూడసాగారు. అలాగ బొమ్మలాగ ఎంతసేపు వున్నారో వారికే తెలియదు.

శ్రీపాల్ కల్పించుకొని, 'రాధాదేవిగారూ! మీ మీద మాకందరకు మంచి అభిప్రాయం వుంది. కాని .. కాని.... మీరు తొందరపడి ఇటువంటి నిర్ణయానికి రావడం మంచిది కాదు!' అని అంటూ వుంటే—

రాధాదేవి మధ్యలో 'మీకు తెలవదండీ! ఒక సంస్థలోని మనిషికి ఎప్పుడూ మంచి వుద్దేశ్యం. అతనికి, అతనిపైన యాజమాన్యానికి వుండాలి. ఎప్పుడయితే అతనిపైన చెడు నావరిస్తే యిక....ఆ సంస్థలో పని చేయడం చాలా కష్టం. అదికాక నా యింటి పరిస్థితులు బాగుగాలేదు. నా కష్టంతో నా వారిని కష్టపరచలేను. గనుక నా వారిని ఆదుకోవాలని నా కోరిక!' అని అందరికీ చేతులెత్తి నమస్కరించి "మీకు నేను తెలిసి అయిన నా కార్యముల వల్లను ఏదైనా తప్పు చేసి వుంటే క్షమించండి. దయచేసి నా రాజీనామాను ఏక మనసుతో మీరందరూ అంగీకరించాలి. నా డ్యూటీ శ్రీ పరమశివంగారికి అప్పగించి వెళ్ళుతాను.

అందరికీ నమస్తే!' అని గబగబా ఫైల్సు తీసుకొని గది డోరు తెరచుకొని బయ్యటకు వచ్చేసింది.

అందరూ ఆమె వెళ్ళినవైపే చూస్తూ అలానే వుండిపోయారు.

[ఇంకా వుంది]


J. P. M. TEXTILES BHAVANI

కావలెను

మా ఫాక్టరీలో తయారైన జంకాళాలు, మరియు బెడ్‌షీట్లు ప్రసిద్ధి చెందినది. వాటిని ప్రతివారూ మెచ్చుకుంటున్నారు. వీటికి ప్రతినిధిగా నున్నవారు మంచి లాభము పొందుతున్నారు.

ఎల్. ఐ. సి. ఏజెంట్లు, రిటైరయిన గవర్నమెంటు పనివారినుంచి, వారు మంచి లాభం పొందుటకు దరఖాస్తులు కోరబడుచున్నాము.

———————: తయారుచేయువారు :———————

**J. P. M. Textiles,**

P. B. No. 60 : : BHAVANI - 638 301.